www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 14 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్వీరాజు | సంపుటి - 07, సంచిక-125 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# కామన్‌వెల్త్ విజేతలకు ప్రధాని మోడీ అభినందనలు

ఆతిథ్యం ఇచ్చి ఆత్మీయంగా పలకరించిన మోడీ ➤ దేశం గర్వించేలా కీర్తి తెచ్చారని కితాబు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13 (సమ సమాజం):** కామన్వెల్త్ క్రీడల పతక విజేతలకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత అథ్లెట్లు చారిత్రక ప్రదర్శన చేసి దేశం గర్వించేలా చేశారని పేర్కొన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రధాని మోడీ తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చారు. వారితో కలిసి ముచ్చటించారు. ఇటీవలే కామన్వెల్త్ క్రీడలు 2022 ఘనంగా ముగిశాయి. ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల పతక విజేతలకు.. ప్రధాని నరేంద్రమోదీ తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చారు. వారిని ఆత్మీయంగా పలకరించారు. ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. 'కుటుంబసభ్యుల్లా మీరంతా ఇక్కడి రావడం నాకెంతో సంతోషంగా ఉంది. ముందుగా కామన్వెల్త్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ, మెడల్స్ సాధించినవారికి నా అభినందనలు అన్నారు. మీరంతా చారిత్రక ప్రదర్శన చేశారు. నాతో సహా దేశం మొత్తం గర్వపడేలా చేశారు. ఆత్మవిశ్వాసం, ధైర్యమే మీ గుర్తింపు. మీ కృషి, స్ఫూర్తిదాయక విజయంతో దేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లోకి అడుగుపెట్టబోతుంది. గత కొన్ని వారాల ప్రయాణం చూస్తే.. క్రీడల్లో దేశం రెండు భారీ విజయాలను అందుకుంది. ఒకటి కామెన్వెల్త్‌లో చారిత్రక ప్రదర్శన చేసింది. రెండోది తొలిసారి చెస్ఒలింపియాడ్‌ను నిర్వహించింది. చెస్ ఒలింపియాడ్‌ను విజయవంతంగా

2వ



## సరిహద్దు కొండల్లో త్రివర్ణ పతాకం రెపరెపలు

జెండాను ఎగురేసిన ఐటీబీపీ జవాన్లు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13 (సమ సమాజం):** స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా అజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రధాని మోడీ ఇటీవలే పిలుపునిచ్చారు. అంతే కాకుండా హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరిన సంగతి కూడా తెలిసిందే. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా ఉత్సవాలు గనంగగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇండో టిబెటన్ సరిహద్దులో ఉండే భారత జవాన్లు కూడా స్వాతంత్య్ర వజ్రోత్సవాల్లో పాల్గొన్నారు. భారత సాతంత్య్ర ఉత్సవాల్లో భాగంగా లఢక్ లో సుమారు 18,400 ఎత్తులో భారత జాతీయ త్రివర్ణ పతకాన్ని ఐటీబీపీ జవాన్లు ఎగురవేశారు. ఇదిలా ఉండగా బద్రినాథ్ లోనూ ఐటీబీపీ జవాన్లు హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్ చేపట్టారు. అక్కడి భక్తులు, స్థానికులతో కలిసి జాతీయ జెండా చేతబూని... నినాదాలు చేస్తూ, సంగీత వాయిద్యాల మధ్య ర్యాలీ నిర్వహించారు.

## చండూరు సభ కామెంట్స్‌పై తప్పయ్యింది

అద్దంకి దయాకర్ వ్యాఖ్యలు సరికాదు

కోమటిరెడ్డికి రేవంత్ క్షమాపణలు

మునుగోడు యాత్రకు రేవంత్ దూరం

కరోనా లక్షణాలతో సెల్ఫ్ క్వారంటైన్



**హైదరాబాద్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా బహిరంగ క్షమాపణలు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతల తిట్లకు బాధ్యత వహిస్తూ రేవంత్ క్షమాపణలు చెబుతూ ట్వీట్ చేశారు. హోంగార్డు ప్రస్తావన, చండూరు సభలో వ్యాఖ్యలపై కోమటిరెడ్డికి క్షమాపణ చెబుతున్నట్లు రేవంత్ తన వీడియోలో పేర్కొన్నారు. చండూరు సభలో అద్దంకి దయాకర్ వ్యాఖ్యలు సరికాదని రేవంత్ అన్నారు. చండూరు సభలో తనను అసభ్య పదజాలంతో దూషించిన అద్దంకి దయాకర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. అప్పటి వరకు మునుగోడుకు దూరంగా ఉంటానని ఎంపీ తేల్చిచెప్పిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల మధ్య రేవంత్ ఓ మెట్టు దిగి కోమటిరెడ్డికి క్షమాపణలు చెప్పారు. మధ్య పత్రికా సమావేశంలో హోంగార్డ్ ప్రస్తావన, మునుగోడు బహిరంగ సభలో అద్దంకి దయాకర్.. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఉద్దేశించి అసభ్యకరమైన పదజాలం వాడటంతో వారు ఎంతో మనస్తాపానికి గురయ్యారు. పీసీసీ అధ్యక్షుడిగా సారీ చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి క్షమాపణ చెబుతున్నా. ఇలాంటి భాష ఎవరికీ మంచిది కాదు. తెలంగాణ ఉద్యమంలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించి, రాష్ట్ర సాధనలో పాత్ర పోషించిన కోమటిరెడ్డిని అవమానించే విధంగా ఎవరూ మాట్లాడిన తగదు. తదుపరి చర్యల కోసం క్రమశిక్షణా సంఘం చైర్మన్ చిన్నారెడ్డి సూచన చేయడం జరుగుతందని రేవంత్ రెడ్డి తన వీడియోలో పేర్కొన్నారు.

## మరోమారు క్షమాపణలు చెబుతున్నా

సోదరభావంతో పార్టీ కోసం పనిచేయండి

వేడుకున్న అద్దంకి దయాకర్



**హైదరాబాద్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పార్టీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మరోసారి క్షమాపణలు చెప్పారు. చండూరు సభలో తాను చేసిన వాఖ్యలకు భాదపడుతున్నట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఔన్నత్యంతో తన తరుపున క్షమాపణ చెప్పారన్నారు. సోదర భావంతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి పార్టీ కోసం పనిచేయాలని అద్దంకి దయాకర్ కోరారు. కాగా... కోమటిరెడ్డి వెంకటరెడ్డికి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పిన విషయం తెలిసిందే. ఈ మేరకు ట్విట్టర్‌లో రేవంత్ క్షమాపణ వీడియోను పోస్ట్ చేశారు. చుండూరులో జరిగిన సభలో కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ బహిరంగంగా తిట్టడంపై బాధ్యత వహిస్తూ ఎంపీకి రేవంత్ క్షమాపణ చెప్పారు. ఇలాంటి భాష... ఎవరికీ మంచిది కాదని, దీనిని మరోసారి క్రమశిక్షణ కమిటీ పరిశీలించాలని చిన్నారెడ్డికి టీపీసీసీ చీఫ్ సూచించారు.

## రేవంత్ క్షమాపణలు అంగీకరించేది లేదు



అద్దంకి దయాకర్‌ను పార్టీనుంచి సాగనంపాల్సిందే

మరోమారు స్పష్టం చేసిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** రేవంత్ క్షమాపణ అంగీకరించేది లేదని ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తేల్చి చెప్పారు. అద్దంకి దయాకర్ ను శాశ్వతంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించిన తర్వాతే క్షమాపణల గురించి ఆలోచిస్తానని ఆయన స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తనకు క్షమాపణలు చెప్పడం సంతోషమేనని తెలిపారు. రేవంత్ రెడ్డి క్షమాపణ గురించి మీడియా ద్వారానే తెలిసిందన్నారు. ఉద్యమకారుడినైన నన్ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం చాలా బాధ కలిగించిందని వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అద్దంకి దయాకర్ ను సస్పెండ్ చేస్తేనే... మునుగోడులో ప్రచారానికి వెళ్తానని తెలిపారు. కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అంటే తమాషా అనిపిస్తుందా.. చిన్న పిల్లాడిలా మాట్లాడారని చెప్పారు. సారీ చెప్తే సరిపోదని కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్ ను సస్పెండ్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. మరోవైపు మునుగోడులో ప్రచారానికి తనకు ఆహ్వానం లేదని పీసీసీ స్టార్ క్యాంపెయినర్, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. పిలవని పేరంటానికి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. పార్టీలోని ఐపీఎస్ లాంటి పెద్దలే మునుగోడులో గెలిపిస్తారని కామెంట్ చేశారు. పార్టీ నుంచి ఒక్కొక్కరిగా వెళ్తున్నా పట్టించుకోవడం లేదని.. తనను మునుగోడులో అనరాని మాటలు అనిపించారంటూ భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



## రాజకీయ తోడేళ్లు కోమటిరెడ్డి బ్రదర్స్

కోమటిరెడ్డి బ్రదర్స్ చేతిలో రాజకీయంగా బలైన గౌడ నేతలారా...., మేలుకోండి !

బహుజన చైతన్యం రానంతవరకు ఉత్పత్తి కులాలపై అగ్రవర్ణాల పెత్తనం, ఆదిపత్య కోరలతో బలిచేస్తూనే ఉంటారు. ఆ కోవకు చెందిన వారే కోమటిరెడ్డి బ్రదర్స్

**హైదరాబాద్, ఆగస్ట్ 13 (సమ సమాజం):**

తొవ్వేకొద్ది కోమటిరెడ్డి బ్రదర్స్ ఘన చరిత్ర బయటకు..

"కాలంబు రాగానే కాటేసి తీరాలి" అనే కాలోజీ సూత్రాన్ని పాటిస్తూ గౌడలు రాజకీయ కక్ష తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కోమటిరెడ్డి బ్రదర్స్ గౌడులను టార్గెట్ చేస్తూ ఎంతోమంది గౌడ నేతలను రాజకీయ సమాధి చేశారు.

- మండల జిల్లా స్థాయిలో ఎదుగుతున్న టువంటి ఎంతో మంది గౌడ లీడర్ల రాజకీయ భవిష్యత్తుని అక్రమ కేసులతో, గుండాలతో బెదిరించి వాళ్ళ రాజకీయ భవిష్యత్తును నాశనం చేసిన కోమటిరెడ్డి బ్రదర్స్ పై గౌడ బిడ్డలందరూ ఉక్కు పాదం మోపాలి. వారిలో కొందరు....
- చెప్పుతో కొట్టి అవమానించి సుంకర మల్లేష్ గౌడ్ రాజకీయ భవిష్యత్తు నాశనం చేశారు.
- మున్సిపల్ మాజీ చైర్మన్ పుల్లెంల వెంకట్ నారాయణ గౌడ్ రాజకీయ భవిష్యత్తు నాశనం చేశారు.
- కాంగ్రెస్ పార్టీలో సీనియర్ గా ఎదుగుతున్న బూడిద బిక్షమయ్యగౌడ్ రాజకీయ భవిష్యత్తుని ఖతం చేశారు.
- రాజకీయంగా ఎదిగిన బూర నర్సయ్య గౌడ్ రాజకీయ జీవితాన్ని ఖతం చేశారు.
- మధుయాస్కీ గౌడ్ ని భువనగిరికి ఎంపీగా రాకుండా అడ్డుకొని రాజకీయ భవిష్యత్తుని ఖతం చేశారు.
- వంగాల స్వామిగౌడ్ రాజకీయ భవిష్యత్తుని ఖతం చేశారు.
- నకిరేకల్ లో తన అనుచరున్ని అడ్డంపెట్టి చెరుకు సుధాకర్ గౌడ్ రాజకీయ భవిష్యత్ కతం చేశారు.
- తిప్పర్తి జడ్పిటిసి తండు సైదులు గౌడ్ ఎమ్మెల్యే కాబోతున్నాడని అక్రమ కేసులతో అతని రాజకీయ జీవితం ఖతం చేశారు.
- భువనగిరిలో పచ్చిమట్ల శివరాజు గౌడ్ రాజకీయ జీవితం ఖతం చేశారు.
- సూర్యాపేటలో రాజకీయంగా ఎదుగుతున్న బండారు ధనుంజయ గౌడ్ రాజకీయ జీవితం ఖతం.
- నల్లగొండలో బైరు మల్లయ్య గౌడ్ రాజకీయ జీవితం ఖతం.
- టిడిపిలో కీలకంగా ఎమ్మెల్యేగా ఎదిగిన మాదగోని శ్రీనివాస్ గౌడ్ రాజకీయ జీవితం ఖతం. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది బహుజన బిడ్డలు కోమటిరెడ్డి బ్రదర్స్ బాధితులుగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్నారు.

## కెసిఆర్ ఏలుబడిలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారారు

ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ ఆగ్రహం



**హైదరాబాద్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** కేసీఆర్ ఏలుబడిలో స్థానిక సంస్థలు అన్ని నిర్వీర్యం అయ్యాయని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. ఎంతో కష్టపడి గెలిచిన ఎంపీపీలు, జడ్పీటీసీలు అంత ఉత్సవ విగ్రహాలు అయ్యారన్నారు. ఎమ్మెల్యేలే గ్రామంలో బాసులు అయ్యారని మండిపడ్డారు. ఇవాళ ఘట్ కేసర్ మండల ఎంపీపీ, స్థానిక సంస్థల గౌరవ అధ్యక్షుడు ఏనుగు సుదర్శన్ రెడ్డిని ఈటెల రాజేందర్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంపీపీలు, జడ్పీటీసీలకు బాధ్యతలు లేవు, నిధులు లేవని

2వ

## రైతుల సంక్షేమం లక్ష్యంగా విధానాలు



బిజెపి అధికారంలోకి రాగానే చర్యలు

కెసిఆర్ కుటుంబపాలన అంతమొందిస్తేనే బాగుపడతాం

పాదాయత్రలో బండి సంజయ్ వెల్లడి

ట్రాక్టర్‌తో పొలం దున్నిన బిజెపి నేత

**యాదాద్రి భువనగిరి, ఆగస్ట్ 13 (సమ సమాజం):** రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే రైతులు అభివృద్ధి చెందేలా, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేలా నిర్ణయాలు తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. అన్నదాతలకు ఏది ఆమోదయోగ్యమో ఆలోచించి అమలు చేస్తామని అన్నారు. వారు అడుకుకనే పరిస్థితి లేకుండా చేస్తామని అన్నారు. బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర గ్రామాల్లో ఉత్సాహంగా కొనసాగుతోంది. అనాజీపురంలో చేపట్టిన పాదయాత్రలో భాగంగా యాదగిరి అనే రైతు వద్దకు బండి సంజయ్ వెళ్లారు. ఈ సందర్భంగా యాదగిరి పడుతున్న ఇబ్బందులతో పాటు, రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

2వ

## సంపాదకీయం

# రాడ్‌క్లిఫ్ కుతంత్రానికి భారత్ బలి !

దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చి 75వసంతాలు పూర్తి కావస్తున్నాయి. ఈ శుభసందర్భంలో దేశం యావత్తు ఆజాదీ కా అమృత మహోత్సవ సంబరాలను జరుపుకుంటోంది. ప్రతి ఒక్కరిలోనూ ఆనందోత్సాహాలు నిండుతున్న శుభసందర్భమిది... జాతీయ భావనతో మది పులకిస్తున్న అమృత ఘడియలివి...పక్షం రోజులు ఊరూరా, వాడవాడా మువ్వన్నెల పతాక రీవిగా రెపరెపలాడుతున్న సుందర దృశ్యాలు దేశమంతటా కాన వస్తున్నాయి. ఏ నోట విన్నా జాతి విముక్తి పోరాటం తాలూకు రోమాంచిత ఘట్టాలపై కథనాలు వినిపి స్తున్నాయి. ఎందరో వీరుల ఆత్మార్పణతో దేశానికి దాస్యపు శృంఖలాలు తెగి, మన జీవితాల్లో కాంతులు నిండాయి...జాతీయ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ ఆజాదీకా అమృత మహోత్సవాలను ఎంతో ఉత్తేజంగా నిర్వహించుకుంటున్నాం. జాతీయభావనను ఉద్దీప్తం చేసేవిధంగా ప్రజలంతా జెండాలు పూని భారతమాతకు శిరసు వంచి నమస్కరిస్తున్నారు. ఎక్కడ చూసినా మువ్వన్నెల పతాకాల రెపరెపలు కానవస్తున్నాయి. అమితమైన ఆనందంతో పులకించిపోతున్న ఈ వేళ మన దేశం ఎంతటి క్షోభ అనుభ వించిందో..ఎందుకు విభజనకు గుయ్యిందో..విభజనతరవాత కూడా ఎందుకు మనపై క్రూరంగా వ్యవహరి స్తున్నారో తెలుసుకోవాల్సిన సమయమిది. నిజానికి దేశ విభజనను ఆపాల్సిన నేతలు చేష్టలుడిగి చూశారు. ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించిన సుభాశ్ చంద్రబోస్ లాంటి పోరాట వీరులు అదృశ్యమయ్యారు. పటేల్ లాంటి వారిని పక్కనపెట్టారు. కేవలం అధికార మార్పిడి జరిగిందే తప్ప దేశం ముక్కలు కాకుండా మన నేతలు అడ్డుకోలేక పోయారు. పిచ్చిగీతలు గీసినట్లుగా మన దేశ సరిహద్దుల గీతను గీసారు. మత ప్రాతిపది కన విబజనకు పట్టుబట్టి చివరకు అది పక్కకు పోయి రెండు ముక్కలు చేసేలా చేశారు. ఈ విభజన కుట్రలో బ్రిటిష్ వాళ్లకు ఆనాటికాంగ్రెస్, ముస్లింలీగ్ పార్టీల నేతలు తొత్తులుగా వ్యవహరించారు. నిజానికి ఆనాడు గట్టిగా నిలబడితే విభజన ఆగేదేనని చరిత్రకారులు చెబుతున్నారు. విభజన వల్ల సాధించే దేమీ లేకపోగా నిరంతరంగా యుద్ధాలు, పగలు, ప్రతీకారాలు పెరిగాయి. విభజనపై రెండువైపులా అసంతృప్తి చెలరేగింది. ఏకంగా 4నెలల వరకు అటు, ఇటు భారీగా వలసలు కొనసాగాయి. రెండు దేశాల్లోనూ మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి. రాడ్‌క్లిఫ్ రేఖ అంతిమంగా బ్రిటిష్ ఇండియాను మూడు భాగాలుగా చేసింది. అవి భారత్, పశ్చిమ పాకిస్థాన్, తూర్పు పాకిస్థాన్! 1971లో తూర్పు పాకిస్థాన్ ప్రజలు పశ్చిమ పాకిస్థాన్‌పై తిరుగుబాటు చేసి బంగ్లాదేశ్‌గా ఆవిర్భవించడం తర్వాతి చరిత్ర! ఇలా స్వాతంత్ర్యాన్ని ఇస్తున్నట్లే ఇచ్చి దేశాన్ని ముక్కలు చేసిన దగుల్బాజీలు బ్రిటిషర్లు. పాకిస్థాన్‌కు 1947 ఆగస్టు 14న, భారత్‌కు ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చేసింది. ఆగస్టు 17న అంటే.. విడిపోకుండానే భారత్, పాక్ ఏర్పడ్డాయి. ఆవిర్భావం తర్వాత విభజన జరిగింది. దాని వెనక పెద్ద కథే నడిచింది. 1947 జూన్ 3న ప్రకటించిన మౌంట్‌బాటెన్ వ్యూహం ప్రకారం.. దేశ విభజన ఖాయమైంది. తమ రాష్ట్రాలను విభజించాలో లేదో తేల్చుకునే అవకాశాన్ని పంజాబ్, బెంగాల్ అసెంబ్లీలకు ఇవ్వడం ద్వారా అగ్గి రాజేశారు. ఒకవేళ విభజన కావాలనుకుంటే వైస్రాయ్ సరిహద్దు కమిషన్‌ను ఏర్పాటు చేస్తాడని ఆ ప్లాన్‌లోనే స్పష్టం చేశారు. తదనుగుణంగా ఏర్పాటైందే భారత్, పాకిస్థాన్‌ల మధ్య సరిహద్దులను ఖరారు చేసిన రాడ్‌క్లిఫ్ కమిషన్.

1947 జులై 8న భారత్‌లో అడుగుపెట్టి.. 10న వైస్రాయ్‌ని కలిసి విభజన గీతలు గీసే పని మొదలెట్టిన లండన్ లాయర్ రాడ్‌క్లిఫ్... భారత రాజకీయ నాయకులెవరినీ కలవకుండానే తనకు తోచిన విధంగా గీతలు గగీసేసారు. వారేమైనా చెప్పాలనుకుంటే.. లాహోర్, కోల్‌కతాల్లో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చినప్పుడు రాతపూర్వకంగా ఇవ్వాలని స్పష్టంచేశాడు. విభజనకు ముందు 40 శాతం దేశం సంస్థానాల పాలనలో ఉంది. అంటే వాటిపై ఆంగ్లేయులకు నేరుగా అధికారం లేదు. కాబట్టి వాటిని విభజించే అధికారం బ్రిటన్‌కు లేకుండా పోయింది. మతపరమైన విభజన కావడంతో సమస్యంతా పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల్లో కేంద్రీకృతమైంది. అంటే రాడ్‌క్లిఫ్ బృందానికి అప్పగించిన పని.. రెండు ప్రాంతాల్లోనూ విస్తరించి, 55శాతం దాకా ముస్లింలున్న బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలను ఇరుదేశాల మధ్య విభజించడమే. ఇందుకోసం రాడ్‌క్లిఫ్ సారథ్యంలో రెండు సరిహద్దు కమిషన్లు ఏర్పడ్డాయి. జులై 16-24 మధ్య కోల్‌కతాలో బెంగాల్ కమిషన్, జులై 21-31 మధ్య లాహోర్‌లో పంజాబ్ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ చేశాయి. అస్సాంలోని సిల్హెట్ జిల్లాపై ఆగస్టు 4-6 దాకా అభిప్రాయాలు సేకరించారు. రాడ్‌క్లిఫ్ నేరుగా ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనలేదు. కానీ ఈ సమావేశాల్లో వివిధ వర్గాల నుంచి వచ్చిన సమాచారం, నివేదికల్ని చదివే ఏర్పాటు చేసుకున్నాడు. పంజాబ్, బెంగాల్‌ల్లో ముస్లిం జనాభా అధికంగా ఉండటంతో ఆ రెండు రాష్ట్రాల్లోనూ పూర్తిగా తమకే కేటాయించాలని ముస్లింలీగ్ కోరింది. తద్వారా పంజాబ్‌లోని సారవంతమైన భూములు తమ పరమవుతాయని ఆశించింది. ఆ తర్వాత కాస్త తగ్గి కొన్ని ప్రాంతాలను భారత్‌కు ఇవ్వడానికి అంగీకరించింది. కేవలం మతప్రాతిపదికనే విభజన జరగాలని తొలుత అనుకున్నా.. ఆచరణలోకి వచ్చేసరికి వ్యూహాత్మక ప్రాంతాలు, రహదారులు, సాగునీటి వ్యవస్థల్లాంటి అంశాలూ ప్రభావితం చేశాయి. ఇందులో కొన్ని భారత్‌కు, మరికొన్ని పాకిస్థాన్‌కు ప్రయోజనం కల్గించాయి. ఉదాహరణకు కోల్‌కతా నుంచి గంగానదికి జలమార్గం విషయంలో ఇబ్బంది లేకుండా ఉండటానికి అత్యధిక ముస్లిం జనాభాగల ముర్షీదాబాద్‌ను భారత్‌కు ఇచ్చారు. హిందూ మెజార్టీ ఖుల్నా జిల్లా పాకిస్థాన్‌కు (తర్వాత బంగ్లాదేశ్‌కు) వెళ్లింది. ఈశాన్య భారతంలోని ఇతర ప్రాంతాలను భారత్‌కు అనుసంధానించేందుకు వీలుగా బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని పలు ముస్లిం మెజార్టీ ప్రాంతాలను భారత్‌లో కలిపారు. ఇక పంజాబ్‌లో ముస్లింలు అధికంగా ఉన్నప్పటికీ గురుదాస్‌పూర్ జిల్లాను భారత్‌లో కలిపారు. కారణం దీన్నుంచి కశ్మీర్‌కు నేరుగా వెళ్లే దారులుండటమే. అలాగే సింధ్‌లోని అనేక హిందూ మెజార్టీ ప్రాంతాలను పాకిస్థాన్‌లో ఉంచారు. ఒకప్పటి సిక్కు సామ్రాజ్య రాజధాని లాహోర్‌ను తొలుత భారత్‌కు కేటాయించారు. కానీ పాకిస్థాన్‌కు పెద్ద నగరం ఏదీ ఉండదనే భావనతో మళ్లీ దాన్ని తొలగించారు. చాలా అంశాలపై కాంగ్రెస్-ముస్లింలీగ్‌లు ఏకాభిప్రాయానికి రాకపోవడంతో రాడ్‌క్లిఫ్ అంతిమంగా తనకు తోచిన నిర్ణయం తీసుకుని ఆమోదముద్ర వేసేశాడు. విశాల దేశాన్ని 4 వారాల్లో 2 ముక్కలు చేసేశాడు. ఆగస్టు 9 కల్లా విభజన పూర్తి చేసిన రాడ్‌క్లిఫ్ అదే రోజు.. తొలి ముసాయిదాను మౌంట్‌బాటెన్‌కు చూపించాడు. ఆయన సూచనల మేరకు 12 నాటికి విభజన తుది ముసాయిదా సిద్ధం చేశాడు. ఇలా మనదేశం ముక్కలు కావడంతో లక్షలాది ఆత్మార్పణం చేశారు.స్వాతంత్ర్యం కోసం లక్షలాది బలి కాగా, విబజన రేఖ కారణంగా మరికొన్ని లక్షల మంది ఆత్మార్పణం చేయక తప్పలేదు. ఈ చరిత్ర ఓ రక్త చరిత్రగా మిగిలింది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అత్యుత్సాహం

గన్‌పేల్చిన మంత్రి తీరుపై సర్వత్రా విమర్శలు
సోషల్ మీడియా వేదికగా విమర్శల వెల్లువ
తాను రబ్బర్ బుల్లెట్ మాత్రమే కాల్చానన్న మంత్రి



**మహబూబ్‌నగర్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** పట్టణంలో నిర్వహించిన 75వ స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ తుపాకీ పట్టుకుని గాల్లోకి కాల్పులు జరిపారు. కాల్పులు జరుపుతుండగా అక్కడే ఉన్న జిల్లా ఎస్పీ గన్ పైకి పెట్టాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. దీంతో మంత్రి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్రీడమ్ ర్యాలీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హల్‌చల్ చేశారు. పోలీసుల నుంచి తుపాకీ తీసుకుని గాల్లో పేల్చారు. ఎస్ఎల్ఆర్ వెపన్‌తో గాల్లోకి మంత్రి కాల్పులు జరిపారు. శ్రీనివాస్‌గౌడ్ కాల్పుల వీడియో సోషల్‌మీడియా లో వైరల్ అవుతోంది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తీరుపై నెటిజన్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి అయితే మాత్రం గాల్లో కాల్పులు జరుపుతారా అని ప్రశ్నిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఫ్రీడమ్ ర్యాలీలో నిర్వహించారు. ర్యాలీ ప్రారంభించే ముందు ఎస్పీ వెంకటేశ్వర్లు తన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ వెపన్‌ను శ్రీనివాస్‌గౌడ్‌కు ఇచ్చారు. గౌరవపదంగా ఆయన గాలిల్లో కాల్పులు జరిపారు. నిబంధలను విరుద్ధంగా ఎస్పీ తుఫాకి ఇవ్వడాన్ని తప్పుబడుతు న్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా మంత్రి కాల్పులు జరపడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పోలీసులు మంత్రికి గన్ ఇవ్వడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ర్యాలీలో మంత్రికి గన్ ఎలా ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి శ్రీనివాస్ గౌడ్ 75వ స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో అత్యుత్సాహం ప్రదర్శించారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వివాదంలో చిక్కుకున్నారు. ఫ్రీడమ్ ర్యాలీలో జనం మధ్య ఆయన హుషారుగా తుపాకీతో కాల్పులు జరిపారు. పోలీసుల చేతుల్లోని తుపాకీని తీసుకుని మరీ ఆయన గాల్లోకి కాల్పులు జరిపిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. మరోవైపు అధికారులు సైతం ఆయన్ని అడ్డుకోలేదనే విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి. అయితే పోలీసుల ఎస్ఎల్ఆర్ వెపన్‌తో గాల్లోకి ఫైర్ చేసిన ఘటనపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పందించారు. తాను కాల్చింది రబ్బర్ బు÷-లలెట్ అని ఆయన ప్రకటన ఇచ్చారు. 'నేను ఆల్ ఇండియా రైఫెల్ అసోషియేషన్ మెంబర్‌ను. క్రీడా శాఖమంత్రిగా నాకు ఆ అర్హత కూడా ఉంటుంది. కానీ, నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఉదంతంపై జిల్లా ఎస్పీని సరైన సమాచారం తెలుసుకోవాలి. ఎస్పీ ఇస్తేనే నేను కాల్చాను. ర్యాలీ ప్రారంభం కావాలంటే సౌండ్ కోసం రబ్బర్ బుల్లెట్ కాలుస్తారు. నేను నిజమైన బుల్లెట్ కాల్చినట్లే అయితే రాజీనామా చేస్తా! అని రాజకీయ, సోషల్ మీడియా విమర్శలకు మంత్రి తీవ్రంగా స్పందించారు. అంతకుముందు వేడుకల్లో భాగంగా అచ్చంపేట పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, డీఎస్పీ కృష్ణ కిషోర్, ఆర్డీవో, ఇతర ప్రజా ప్రతినిధులు, పోలీసులు, విద్యార్థులు, మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు. ఇండియాకు స్వాతంత్రం తీసుకొచ్చిన అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు ప్రజాప్రతినిధులు వివరించారు. స్వాతంత్ర సమరయోధుల ఉద్యమాలను సినిమా రూపంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో స్వాతంత్య వజ్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం అయన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ మైదానం నుంచి ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..గాంధీజీ, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ వంటి ఎంతో మంది దేశభక్తులు, స్వాతంత్య సమరయోధులు వారి ప్రాణాలను అర్పించి బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమికొట్టి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చారని అన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు పోవాలని, మానవత్వంతో ప్రతి ఒక్కరు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలని, అభివృద్ధి లో యువత ముఖ్యపాత్ర పోషించాలని ఆయన సూచించారు. స్వాతంత్ర్య ఫలాలు అందరికీ సమానంగా దక్కాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆరోగ్యం అందిన నాడే మనం నిజమైన అభివృద్ధిని సాధించిన వారమవుతామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ ఆర్.వెంకటేశ్వర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, మున్సిపల్ చైర్మన్ కెసి నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు గోపాల్ యాదవ్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ గణేలిష్ ఉన్నారు.

# జాతీయ జెండాలా మానవహారం

5వేల మందితో చండీఘడ్‌లో అద్భుత ప్రదర్శన ■ నెట్టింట వైరల్‌గా మారిన వీడియో



**చండీగఢ్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ చేపట్టిన హర్ ఘర్ తిరంగ ప్రచారాన్ని బలోపేతం చేసేలా చండీగఢ్ వాసులు ఒక వినూతన కార్యక్రమాన్ని చేపట్టారు. 5వేల మంది జెండాలా మానవహారంగా నిలిచి రికార్డు సృష్టించారు. అందులోభాగంగా అతి పెద్ద జాతీయ జెండాలా మానవహారంగా నిలబడి రికార్డు సృష్టించారు. ఈ మేరకు చండీగఢ్ విశ్వవిద్యాలయంలోని సుమారు 16 ఎకరాల క్రికెట్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 5 వేల మందికి పైగా మానవహారంగా నిలబడి అందరి దృష్టిని ఆకర్షించారు. ఎన్ఐడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు కేంద్ర మంత్రి మీనాకాశీ లేఖి, చండీగఢ్ యూనివర్సిటీ ఛాన్సలర్ సత్నామ్ సింగ్ సంధు, విశ్వవిద్యాలయ అధికారులు తదితరులు హాజరయ్యేరు. దాదాపు 5 వేల మందికి పైగా అతిపెద్ద మానవహారంలా ఏర్పడి జాతీయ జెండాను రెపరెపలాడించి సరికొత్త రికార్డును సృష్టించారు. 'హర్ ఘర్ తిరంగ' అనేది జాతీయ జెండాతో ఉన్న సంబంధాన్ని అధికారికంగా లేదా సంస్థాగతంగా ఉంచడం కంటే వ్యక్తిగతంగా దేశభక్తిని పెంపొందించేలా మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యం. భారతదేశ ప్రజలు, మన దేశ సంస్కృతి, సమర యోధులు సాధించిన విజయాలు వాటి వెనుక దాగి ఉన్న అద్భుతమైన చరిత్రను స్మరించుకుంటూ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే భారత ప్రభుత్వం ఈ ఉత్సవాలను ప్రోత్సహించింది. ఈ మేరకు ఈ ఘటనకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. దీనికి నెటిజన్లు ఫిదా అవుతూ అభినందనలు తెలుపుతున్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమస్ఫూర్తిని తెలియచేయాలి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**వరంగల్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** భారత స్వాతంత్య ఉద్యమ స్ఫూర్తిని ప్రజలకు తెలియచేయాలని, ఆనాటి ఉద్యమ నేపథ్యం భావి తరాలకు అర్థం చేయించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. స్వాతంత్య వజ్రోత్సవాలను పురస్కరించుకొని హనుమకొండ పోలీస్ హెడ్ క్వాటర్స్ నుంచి జేఎన్ఎస్ వరకు నిర్వహించిన ఫ్రీడం ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు చోట్ల నిర్వహించిన ఫ్రీడం ర్యాలీలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాంతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించా లన్నారు. ఈ నెల 16న సామూహిక స్వాతంత్య జాతీయ గీతాలోపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు వజ్రోత్సవాలని విజయవంతం చేయాలన్నారు. గాంధీజీ ఆశయాలను మనమంతా ఆచరించాలి. ప్రజాస్వామ్యాన్ని పరిఢవిల్లేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన దేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచేలా మనమంతా కృషి చేయాలని మంత్రి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, జి.డబ్ల్యూ.యం.సి . మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, జి.డబ్ల్యూ.యం.సి కమిషనర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి పాల్గొన్నారు.

# కెసిఆర్ ఏలుబడిలో స్థానిక సంస్థలు నిర్వీర్యం

(మొదటి పేజీ తరువాయి) ఆరోపించారు. కొన్ని వేల మంది సర్పంచ్ లు మీ వెంటనే వస్తాం అని చెప్పారని అన్నారు. ఘట్ కేసర్ ఎంపీపీ చాలా ఇబ్బంది పడుతున్నారు.. వీరితో పాటు సర్పంచ్ కావేరి మర్పల్లి, ఉప్పసర్పంచ్ నరేష్, ఇలా చాలా మంది ప్రజా ప్రతినిధులు, లీడర్స్ బీజేపీ పార్టీలో చేరనున్నారు అని తెలిపారు. వారి వారి హోదా బట్టి పార్టీలో స్థానాలు కేటాయిస్తామని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రజా ప్రతినిధులకు ఒకటే ఒకటి చెపుతున్న.. 'బానిస ప్రభుత్వంలో ఉంటారా బయటకు వస్తారా అని ఈటల రాజేందర్ అడిగారు. ఈ స్థానిక సంస్థలో ఉన్న ప్రజా ప్రతినిధులు అందరూ త్వరలో బీజేపీ పార్టీలో చేరే అవకాశం ఉందని అన్నారు. ఈ ఒక్కసారి బీజేపీ పార్టీకి ఓటు వేసి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వనికి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. మునుగోడులో చాలా మంది బీజేపీ పార్టీలో చేరే అవకాశం ఉంది అని తెలిపారు. వారం రోజుల్లో ఘట్ కేసర్ లో భారీ సభ ద్వారా ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్ కావేరి, తదితర టీఆర్ ఎస్ నాయకులు బీజేపీలో చేరబోతున్నారని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# రైతుల సంక్షేమం లక్ష్యంగా విధానాలు



(మొదటి పేజీ తరువాయి) ఆరుగాలం కష్టించి పని చేసినా.. రెక్కలు ముక్కలవ్వడమే తప్ప, రైతన్నలు బాగుపడే పరిస్థితి లేదని యాదగిరి.. బండి సంజయ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశాడు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే రైతులు లాభపడే విధంగా నిర్ణయాలు తీసుకుంటామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. మరోవైపు రైతు యాదగిరి కోరిక మేరకు బండి సంజయ్ ట్రాక్టర్ నడిపారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేయాలని, ప్రజాసంగ్రామ యాత్ర లక్ష్యం కూడా అదేనని బండి సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గోడును సంజయ్ ఎదుట వెల్లబోసుకున్నారు. ప్రజలను కలుసుకుని పేదరికం, ఇబ్బందులు, పింఛన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. తాము ఓట్లకోసం రాలేదని, ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు ప్రధాని మోదీ పంపిస్తే వచ్చామని సంజయ్ వివరించారు. కేంద్రం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని వాటి గురించి వివరించారు. మహిళా నాయకురాళ్లు బండి సంజయ్‌కి మంగళహారతులతో స్వాగతం పలికారు. బీజేపీ అధికారంలోకి రాగానే కల్లుగీత కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అందరూ ఎదురు చూస్తున్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా టీఆర్ఎస్‌కు నూకలు చెల్లినట్టేనన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎప్పుడు సాగనంపుదామా! అన్న ఆసక్తితో అందరూ ఎదురు చూస్తున్నారన్నారు. అవినీతి, కుటుంబ పాలనకు చరమగీతం పాడటమే బీజేపీ ధ్యేయమని, అవినీతికి తాము వ్యతిరేకమని, కుటుంబ పాలనను అంతమొందించడమే ప్రజాసంగ్రామ యాత్ర ఉద్ధేశమన్నారు. రుణమాఫీ చేయకుండా మోసం చేస్తున్న కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తనపేరిట ప్రచారం చేసుకుంటున్నారని, ఉచిత బియ్యం కూడా కేంద్రమే ఇస్తుందని బండి సంజయ్ అన్నారు. రైతాంగానికి రుణమాఫీ చే స్తామని చెప్పి సీఎం కేసీఆర్ మోసం చేశాడన్నారు. పంట బీమా కల్పించకపోవడంతో అకాల వర్షాలకు రైతాం గం నష్టపోయిందన్నారు. నిరుద్యోగ సమస్య తీరుస్తామని, ఇంటికో ఉగ్యోగమంటూ ఆయన ఇంట్లోనే ఉద్యోగాలను నింపుకున్నారని, నిరుద్యోగులను మోసగించారని, ఇదీ ఆయన నైజమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను సీఎం కేసీఆర్ మోసగిస్తున్నారని, ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని, ప్రజలకు మాయమాటలు చెబుతున్న ఆయనపై అందరూ కోపంగా ఉన్నారన్నారు. ఎన్నికలొస్తేనే సీఎం కేసీఆర్ కు ప్రజలు గుర్తుకొస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి ప్రజా సంగ్రామ యాత్రతో గ్రామ గ్రామాన పాదయాత్ర నిర్వహిస్తున్నానని చెప్పారు. గత ఎన్నికల్లో ఓటుకు రూ.20వేల వరకు ఖర్చుచేసిన కేసీఆర్, రాబోయే మునుగోడు ఉప ఎన్నికలో ఓటుకు రూ.30వేల వరకు ఖర్చు చేయడానికి సిద్ధమవుతున్నారని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల్లో బీజేపీని గెలిపించడంతో సీఎం కేసీఆర్ అహంకారం తగ్గి ఫామ్‌హౌస్ వదిలి ప్రగతిభవన్‌కు వస్తున్నారని చెప్పారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను ఓడిస్తే కేసీఆర్ రాక్షస పాలన అంతమవుతుందన్నారు. కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మూడు ఎకరాల భూమి, దళితబంధు, డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చాయా అన్ని స్థానికులను అడగ్గా ఏది ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ నుంచి 12మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్నప్పుడు రాజీనామాచేసి ఎన్నికలకు వెళ్లారా అని ప్రశ్నించారు. బీజేపీలో చేరిన ప్రతీ ఒక్క రూ ఆ పదవులకు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లారని, అలా ఎన్నికలకు వెళ్లిన వారు మొనగాళ్లని సంజయ్ అన్నారు.

# చండూరు సభ కామెంట్స్‌పై తప్పయ్యింది

**హైదరాబాద్, ఆగస్ట్ 13 (సమ సమాజం):** మునుగోడులో పాదయాత్రకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దూరంగా ఉన్నారు. కరోనా లక్షణాలతో ఆయన సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లారు. కరోనా పరీక్షకు శాంపిల్స్‌ను పంపించారు. మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో నారాయణపురం నుంచి చౌటప్పల్ వరకు కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టింది. మునుగోడు నియోజకవర్గంలో పొలిటికల్ హీట్ పెరుగుతోంది. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడంతో మునుగోడులో ఉప ఎన్నికలు తప్పనిసరి అయ్యాయి. దీంతో అన్ని పార్టీలు ఉప ఎన్నికల కసరత్తును ప్రారంభించాయి.

# కామన్‌వెల్త్ విజేతలకు ప్రధాని మోడీ అభినందనలు

(మొదటి పేజీ తరువాయి)
నిర్వహించడమే కాకుండా మంచి ప్రదర్శ నను కొనసాగించాం. వారికి కూడా నా అభి నందనలు' అని అన్నారు. కాగా, కామ న్వెల్త్‌లో భారత్ నాలుగో స్థానంతో ముగించింది. మొత్తం 61 పతకాలు సాధించింది. ఇందులో 22 స్వర్ణ పతకాలు సహా 16 రజతం, 23 కాంస్య పత కాలు ఉన్నాయి.



# ఆటో డ్రైవర్లు నీతి నిజాయితీలకు చిరునామాగా నిలవాలి

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ



**కరీంనగర్, ఆగస్టు 13 (సమ సమాజం):** ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తనతో మెదులుతూ నీతి నిజాయితీలకు చిరునామాగా నిలువాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు కులమతాలు వేరైనా మనమంతా భారతీయులమే అనే భావంతో మెదులుతూ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఆజాదీ - కా- అమృత్ మహోత్సవంలో భాగంగా శనివారం నాడు కరీంనగర్లో ఆటో డ్రైవర్లు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటో ర్యాలీని నిర్వహించారు. కమిషనరేట్ కేంద్రం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర వజ్రోత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అన్ని వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని చెప్పారు. జాతీయ జెండాతో నిర్వహించే కార్యక్రమాల్లో నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు పోలీస్ శాఖ తరపున సహకారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లందరూ యూనిఫారంలను ధరించి రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. కమిషనరేట్ కేంద్రం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్టాండ్ - వన్ టౌన్ - కమాన్ ల మీదుగా తిరిగి ప్రతిమ మల్టీప్లెక్స్ - గీతా భవన్ - ఐబి గెస్ట్ హౌస్ - కోర్టు చౌరస్తా ల మీదుగా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్లు తిరుమల్, నాగార్జున రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాయీబ్రాహ్మణులను కించపరిచే వారిని కఠినంగా శిక్షించాలి

### గుంజపడుగు హరిప్రసాద్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక



**కరీంనగర్, ఆగస్టు 13 (సమ సమాజం):** నాయీ బ్రాహ్మణులని కులం పేరుతో కానీ, మంగళి అనీ కాని, మంగళోడ అనీకాని, బొచ్చు గొరిగేవాడ అనీకానీ, మంగలీధి అనీ, కొండమంగళోడాని ఇలా తదితర పదాలతో ఇతర వర్గాలకు సంబంధించిన వారు ఎవ్వరైనా నాయీబ్రాహ్మణులను దూషిస్తే వారిపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని. ఈ సమాజానికి అనునిత్యం మా కులవృత్తి ద్వారా సేవా లు చేస్తూ వారి కష్టంలో సంతోషంలో ప్రజలతో మమేకమై మమల్ని నాన రకాలుగా మా పైన దాడులు చేస్తూ, ఇష్టమైన రీతిలో దుశిస్తూ, బహిరంగ కించపరిచి, మా సెలూన్స్ పైన దాడులు చేసి మా యొక్క మనోభావాలను దెబ్బ తీస్తున్న వారిని కఠినంగా శిక్షించి మా ఆత్మగౌరవాన్ని కాపాడాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ ప్రభుత్వాన్ని కోరుతున్నమని వారు అన్నారు. ఇటీవల పక్కన ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు చెందిన ఏ వ్యక్తిపైనైనా అవమానకరమైన పదాలను ఉపయోగించడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జీవో ఇవ్వడం జరిగిందని. నాయీబ్రాహ్మణ సామాజిక వర్గాన్ని కించపరిచే వారిని శిక్షించే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా బాగుందని అలాగే తెలంగాణ లో కూడ నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం అనేక మంచి కార్యక్రమాలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మన తెలంగాణ లో కూడా నాయీ బ్రాహ్మణులను కించపరిచే పదాలు అయినా మంగలి, మంగలోడా, బొచ్చు గురిగేటోడా, మంగళదనా, కొండ మంగలి, అలాంటి పదాలను వాడినప్పుడు ప్రభుత్వం వెంటనే నాయీబ్రాహ్మణుల మనోభావాలు దెబ్బ తినకుండా మా యొక్క ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నప్పుడు వెంటనే అలాంటి పదాలు ఉపయోగించే వారిపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా జీవో ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చి తెలంగాణ లో ఉన్న నాయీబ్రాహ్మణ లకు న్యాయం చేయాల్సిందిగా తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ లు అన్నారు..

# స్వతంత్ర భారత వజ్రోత్సవాల ర్యాలీలో ఆందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్



**అందోల్-జోగిపేట్, ఆగస్టు 13 (సమ సమాజం):** స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించే వజ్రోత్సవ ర్యాలీలో అందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్ గారి ఆధ్వర్యంలో అందోల్- జోగిపేట్ లో విద్యార్థి విద్యార్థినులతో వివిధ శాఖల అధికారులతో వందే'మాతరం అంటూ భారీ నినాదాలతో జోగిపేట్ పట్టణంలో విజయవంతంగా "వజ్రోత్సవ ర్యాలీ" నిర్వహించడం జరిగింది. 75 వ స్వతంత్ర వస్రోత్సవంలో భాగంగా శనివారం ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని అధికారులు చేపట్టారు. జోగిపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం నుండి పట్టణంలోని అన్ని పాఠశాలల విద్యార్థుల తో కలిసి ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు,అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ భారీ జెండాతో నిర్వహించిన ర్యాలీ కన్నుల పండుగ కొనసాగింది. మధ్యరంగం వద్దకు చేరుకోగానే విద్యార్థులు జాతీయ గీతాల పాటలకు నృత్యాలు వేస్తూ పలువుని ఆకర్షించారు. మధ్య రంగంలోని మహాత్మ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రజాప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్టేడియం నుండి మొదలైన ఈ భారీ ర్యాలీ ప్రధాన చౌరస్తా, గౌని చౌరస్తా, మధ్యరంగం నుండి పాఠశాలల రోడ్డు గుండా అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకుంది. అనంతరం విద్యార్థులు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే అందరూ వందేమాతరం నినాదాలతో ఈ ర్యాలీని ముగించారు. వారి ఆశయ సాధనలో ముందుకు ఐక్యతగా నడవాలన్నారు. మనందరిలో ఉన్న సమైక్యతతో దేశభక్తిని చాటుకోవాలని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పిలుపునిచ్చారు. మధ్యరంగం వద్దకు చేరుకోగానే విద్యార్థులు జాతీయ గీతాల పాటలకు నృత్యాలు వేస్తూ పలువుని ఆకర్షించారు. మధ్యరంగంలోని మహాత్మ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రజాప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు.

# స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా విద్యార్థుల ర్యాలీ

**టేక్మాల్, ఆగస్టు 13 (సమ సమాజం):** మెదక్ జిల్లా టేక్మాల్ మండల లోని ఎల్లుపేట గ్రామం లో భారత దేశ 75 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా, ఆజాదీక అమృత్ వజ్రోత్సవ ఉత్సవాలలో భాగంగా ఎల్లు పేట గ్రామంలో వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ బొరంచా సాయిలు ఆధ్వర్యంలో హై స్కూల్, ప్రైమరీ స్కూల్, పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థిని విద్యార్థులతో కలిసి గ్రామంలోని వివిధ వార్డుల్లో జాతీయ జెండాలు,తివర్ణ రంగుతో కూడిన బెలూన్లను పట్టుకొనివజ్రోత్సవ ర్యాలీనీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని, ఎంతోమంది మహనీయుల బలిదానాలను స్మరించుకుంటూ స్వాతంత్ర ఉద్యమ ఆవశ్యకతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, నినాదాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోరంచ సాయిలు, ఉప సర్పంచ్ బెస్తా మల్లేశం, ఎంపీటీసీ, మామిడి, సురేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సిద్దు, తెరాస పార్టీ గ్రామ అధ్యక్షులు జక్కుల ప్రభాకర్ ,పాఠశాలలా ప్రధానోపాధ్యాయులు, శివకుమార్ ,బాల్య, ఉపాధ్యాయులు ధర్మ, సర్వన్ , సాయి రెడ్డి, వాసవి, సుభాష్, అంగన్వాడి టీచర్లు, సరిత, మాధవి, యువజన సంఘాల నాయకులు కమలాకర్, బీరప్ప, గ్రామ పెద్దలు హనుమ గౌడ్ లోహిత్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు గ్రామ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

# మహనీయుల అడుగుజాడల్లో నడిచేందుకు ముందుకు పోవాలి

### దామోదర రాజ నరసింహ

**అల్లాదుర్గం, ఆగస్టు 13 (సమ సమాజం):**స్వతంత్ర పోరాటంలో మహాత్మా గాంధీ చేసిన పోరాట స్ఫూర్తిని తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ గ్రామం వద్ద బసవేశ్వరుని విగ్రహానికి ఆయన పూలమాలవేసి అటు నుండి చిల్వర్ కు చేరుకొని జాతీయ జెండాను చేతబట్టి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో పాదయాత్ర ప్రారంభించారు. 75 సంవత్సరాలు స్వతంత్ర పోరాట వజ్రోత్సవాల్లో భాగంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ పిలుపు లో భాగంగా పాదయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. దామోదర్ రాజనర్సింహ పాదయాత్రలో కార్యకర్తలు కథంలో కదం త్రొక్కుతూ ముందుకు సాగారు. భారత్ మాతాకీ జై,అంటూనినాదాలు చేస్తూ యువకులు భారీ సంఖ్యలో జాతీయ జెండాను చేత పట్టి పాదయాత్రతో అల్లాదుర్గం స్థానిక బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అటు నుండి అల్లాదుర్గంలోని ప్రధాన వీధుల గుండా తిరుగుతూ భారత్ మాతాకీ జై, మహాత్మా గాంధీ కి జై, వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ స్థానిక వెంకటేశ్వర ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. అక్కడ అల్లాదుర్గం స్వాతంత్ర్య సమరయోధుడు మజిగ ఈశ్వరయ్యకు ఆయన పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ. భారతదేశం విముక్తి కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి స్వాతంత్ర్యాన్ని సాధించి 75 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా దేశంలోనే ప్రతి ఒక్కరు స్వాతంత్ర్య స్ఫూర్తిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాటి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాట ఫలితంగానే స్వాతంత్ర్యం సిద్ధించిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ లాంటి మహనీయుల అడుగుజాడల్లో నడిచేందుకు ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. శేషారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జోగిపేట కౌన్సిలర్ డాకూరి శంకర్. అప్పాజీపల్లి శ్రీనివాస్,చిల్వర్ కిరణ్ కుమార్, అంజాగౌడ్, బోయిని గోపాల్, గడి పెద్దాపూర్ విట్టల్ రెడ్డి, సీతానగర్ బేతయ్య, బసన్న గారి బాలకృష్ణ, బలరాం, సాయిబాబా, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టేక్మాల్ లో వజ్రోత్సవ ఫ్రీడమ్ ర్యాలీ

**టేక్మాల్, ఆగస్టు 13 (సమ సమాజం):** మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో స్వతంత్ర వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత ఫ్రీడం ర్యాలీ నిర్వహించారు. ఈ ఫ్రీడమ్ ర్యాలీ చౌరస్తా నుంచి టేక్మాల్ బస్టాండ్ వరకు పాదయాత్రగా బయలు దేరి జై జై మాత భారత్ మాతకి జై అంటూ వందేమాతరం వందేమాతరం అంటూ ముందుకు సాగారు. భారత దేశానికి 75 సంవత్సరాల స్వాతంత్ర వేడుకలను పురస్కరించుకొని, స్వాతంత్ర భారత వజ్రోత్సవాల్లో" భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, ఎంసిసి విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు, అందరు కలిసి ఫ్రీడమ్ ర్యాలీ నిర్వహించిన ర్యాలీలో, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు, జై జై మాత భారత్ మాతా, అంటూ వందేమాతరం వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారుఈ కార్యక్రమంలో ఎంపిపి చింతా స్వప్న రవి, తాసిల్దార్ మధుసూదన్, ఎస్సై బి. లింగం, ఇన్చార్జి ఎంపిడిఓ విష్ణువర్ధన్, గ్రామ సర్పంచ్ సాయి కోటి సుప్రజా భాస్కర్, ఎంపీటీసీ నిమ్మ వాణి రమేష్, హన్మంతరావు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడులో మూడు ముక్కలాట



మూడు పార్టీలకు ప్రతిష్టగా మారిన ఉప ఎన్నిక

బిజెపి గెలిస్తే తెలంగాణాపై మరింత ఫోకస్

టిఆర్ఎస్ గెలిస్తేనే జాతీయ రాజకీయాల్లో కెసిఆర్‌కు పట్టు

కాంగ్రెస్ గెలిస్తేనే రేవంత్‌కు భవిష్యత్

**హైదరాబాద్, ఆగస్టు 13 (సమ సమాజం):** అధికారపక్షంతో పాటు విపక్ష పార్టీలకు మునుగోడు ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ ఉప ఎన్నికలో గెలిచిన వారే రేపటి సార్వత్రిక ఎన్నికలకు హాట్ ఫేవరేట్ కానున్నారు. ఈ ఉప ఎన్నికగెలవడంద్వారా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకున్న వ్యక్తిగత సత్తాను చాటాల్సి ఉంది. ప్రజలంతా తమవైపే అంటున్న ఆయనకు వ్యక్తిగతంగా ఇది ఎంతో ప్రతిష్టాత్మకం కానుంది. ఇదే సదర్భంలో తెలంగాణ లో అధికారంలోకి వస్తామని పదేపదే ప్రకటిస్తున్న బిజెపికి కూడా ఇదో అగ్ని పరీక్షే. ఇక్కడ గెలిస్తేనే బిజెపి గురించి ప్రజలు ఆలోచిస్తారు. ఇకపోతే అధికార టిఆర్ఎస్ పార్టీకి,ముఖ్యంగా కెసిఆర్‌కు ఇక్కడ గెలవడం ఎంతో అవసరం. జాతీయ రాజకీయాలపై ఫోకస్ పెట్టిన ఆయన మునుగోడులో గెలిస్తేనే బిజెపికి సవాల్ విసిరే అవకాశం ఉంది. తన పాలనపై విమర్శలకు చెక్ పెట్టగలుగుతారు. సర్వే నివేదికలన్నీ ఎలా ఉన్నా పరిస్తితులు టీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయని చెప్పుకోవడం వేరు.. గెలవడం వేరు. ఇకపోతే సవాళ్లు విసురుతున్న రేవంత్ రెడ్డికి మాత్రమే ఈ ఎన్నిక ప్రతిష్టాత్మకం కానుంది. ఇక్కడ ఓడిపోవాలనే కాంగ్రెస్ నేతలు మనసులో కోరుకుంటారు. ఓడితే నెపాన్ని రేవంత్‌పై నెట్టి..అతడిని పిసిసి నుంచి తప్పించాలన్న డిమాండ్తెరపైకి తీసుకుని వస్తారు. గతంలో హుజూరాబాద్‌లో డిపాజిట్ దక్కనప్పుడే ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. అందుకే మునుగోడులో విజయం మూడు పార్టీలకు కూడా ముఖ్యమే. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభ్యర్థి ఎంపిక కూడా ముఖ్యమే. బిజెపి నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బరిలోకి దిగుతారు. కాంగ్రెస్‌లో అభ్యర్థి కోసం మల్లగుల్లాలు పడుతున్నారు. అలాగే టిఆర్ఎస్‌లో కూసుకుంట్లకు ఇవ్వరాదన్న డిమాండ్ ఉంది. మునుగోడు ఉపఎన్నికకు దూరంగా ఉండాలని, రేవంత్ తీరుపై ఆగ్రహంగా ఉన్న ఆ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిర్ణయించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటి నుంచీ వామపక్షాలకు పట్టు ఉండేది. ఇటీవలి కాలంలో వారి పోరాటాలు ఎక్కడా కానరావడం లేదు. దీంతో జిల్లాలో ఒక్కటంటే ఒక్క స్థానం కూడా ఆ పార్టీకి లేదు. బీజేపీకి పునాదులు లేకపోయినా ఇప్పుడు కోమటిరెడ్డితో పునాది పడిందనే చెప్పాలి. అయితే అందరికన్నా ఉత్సాహంగా బీజేపీ నాయకత్వం ఉంది. మునుగోడు ఎలాగూ సిట్టింగ్ సీటు కానప్పుడు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని టిఆర్ఎస్ పార్టీలోని ఒక వర్గం వాదిస్తున్నది. ఓడినా అది తమ సీటు కాదన్న వాదనను తీసుకుని వచ్చే ప్రయత్నం చేయవచ్చు. దీంతో తమకు వచ్చిన నష్టం కూడా ఏమీ లేదని హుజూరాబాద్‌లో చేసిన ప్రకటనతో సిద్దంగా ఉంది. కాంగ్రెస్‌లో ఈ వాదన మరోలా వినిపిస్తున్నది. పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీ తరఫున బరిలోకి దిగుతున్నప్పుడు ఆ పార్టీకి ప్రతిష్ఠాత్మకం అవుతుంది తప్ప తమకెలా అవుతుందని వాదిస్తున్నారు. కాగా, చండూరు సభపై సమాచారం ఇవ్వకపోవటం, ఉప ఎన్నికపై గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆహ్వానించకపోవటంపై భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహంతో ఉన్నారు. ఉపఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇది పరోక్షంగా రాజగోపాల్‌రెడ్డికి మద్దతుగా నిలిచేలా, క్షేత్రస్థాయిలో అనుచరులకు సమాచారం ఇచ్చేదిగా ఉంది. హుజూరాబాద్‌లో బీజేపీ గెలిచినా ఫర్వాలేదన్న ఉదాసీనతను మునుగోడులో ప్రదర్శిస్తే మొదటికే మోసం వస్తుందని కాంగ్రెస్‌లోని ఓ వర్గం వాదిస్తోంది. ఒకవేళ బీజేపీ గెలిస్తే టిఆర్ఎస్,కాంగ్రెస్ రెండు పార్టీలకు కూడా కష్టమే. పార్టీ వలసలను ఆపడం కష్టమన్న భయం పట్టుకుంది. మునుగోడులో టీఆర్ఎస్ గెలిచినా ఫర్వాలేదు కానీ బీజేపీని నిలువరించే వ్యూహంతో పనిచేయాలని కొందరు కాంగ్రెస్ నేతలు ఉన్నట్లు సమాచారం. అందుకే మునుగోడు ఉపఎన్నికలో పార్టీకి జరిగే నష్టాన్ని ఏ మేరకు తగ్గించుకోగలమని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం యోచిస్తున్నది. ఉపఎన్నిక జరిగేనాటికైనా కొంత బలపడేలా వ్యూహరచన చేస్తున్నది. ఇకపోతే ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బిజెపి సంస్థాగత వ్యవహారాలు చూడటానికి ప్రత్యేకంగా సునీల్ బన్సాల్‌ను ఇన్‌చార్జిగా నియమించింది. ముందస్తు ఎన్నికలకు సై అంటూ ఇంతకాలం కాలు దువ్విన బీజేపీ ఇప్పుడు మునుగోడు ఉపఎన్నిక ద్వారా కాంగ్రెస్, టిఆర్ఎస్ లకు సవాల్ విసురుతోంది. దీంతో మునుగోడ ఉప ఎన్నిక దేశవ్యప్త చర్చగా మారింది. జాతీయస్థాయిలో మోడీకి ప్రత్యమ్నాయం కావాలని చూస్తున్న కెసిఆర్ ఈ ఎన్నికలో సర్వ శక్తులు ఒడ్డబోతున్నారు. ఇక్కడ గెలవడం ద్వారా ఢిల్లీపై గురిపెట్టాలన్న ఆలోచనలో ఉన్నారు. మరోవైపు మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం గతంలో కమ్యూనిస్టులకు కంచుకోటగా నిలిచిందని, ఐదు పర్యాయాలు సీపీఐ గెలుచుకున్నదని చెప్పారు. 2018లో కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతు ఇచ్చి గెలిపించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్వార్థ ప్రయోజనాల కోసం పదవికి రాజీనామా చేసి, బీజేపీలో చేరుతున్నారని మండిపడ్డారు. మునుగోడులో సీపీఎం, సీపీఐ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించాయి. రెండు పార్టీల్లోనూ టీఆర్ఎస్ వైపే మొగ్గు కనిపిస్తోంది. లెఫ్ట్ పార్టీలకు ఇక్కడ దాదాపు 20 వేల ఓట్లు ఉంటాయని అంచనా. ఎన్నికల్లో పోటీ చేస్తే ఓట్లు చీలిపోయే అవకాశం ఉంటుందని, భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. ఈక్రమంలో రాష్ట్ర రాజకీయాలు ప్రస్తుతం మునుగోడు చుట్టూ తిరుగుతున్నాయి. ప్రధాన పార్టీల నేతలంతా బైపోల్ పైనే ఫోకస్ పెట్టారు. ఈ నెల 20న టీఆర్ఎస్, 21న బీజేపీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నాయి. మరోవైపు టీఆర్ఎస్ అసమ్మతి వాదులు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి వ్యతిరేకంగా మీటింగ్ పెట్టుకున్నారు. కూసుకుంట్లకు టికెట్ ఇవ్వొద్దని కోరుతూ తీర్మానం చేశారు. మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం మునుగోడు, నాంపల్లి మండలాల్లో పర్యటించారు. తాను ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో స్థానిక నేతలకు వివరించారు. 21న నిర్వహించే అమిత్‌షా బహిరంగ సభ గురించి మాట్లాడారు. మొత్తంగా మూడు పార్టీలకు ఇది సవాల్ లాంటిదే.

# వేల్పుగొండ లో వజ్రోత్సవ ర్యాలీ చేపట్టిన విద్యార్థులు



**టేక్మాల్, ఆగస్టు 13 (సమ సమాజం):** మన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భం గా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న " ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" కార్య క్రమంలో భాగంగా మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహం" కార్యక్రమంలో బాగంగా శనివారం నాడు మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ బొయిని నారాయణ, ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులచే గ్రామంలో విధులలో జాతీయ జెండాలను చేత పట్టుకొని జాతీయత స్ఫూర్తి ప్రతిధ్వనించేల బారి ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.జై జవాన్ జై కిసాన్, భారత్ మతకి జై,వందేమాతరం,నినాదాలతో వజ్రోత్సవ ర్యాలీని విజయవంతం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల, ప్రధానోపాధ్యాయులు కృష్ణ, ఉపాధ్యాయులు మాధవి, మల్లప్ప, ఎల్లమ్మ, నాగరాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రఘు, అంగన్ వాడి కార్యకర్తలు సంగమణి, కవిత, గ్రామ ప్రజలు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ జాతీయత స్ఫూర్తిని ప్రదర్శించారు.

# భావితరాలకు స్ఫూర్తి నిచ్చే వజ్రోత్సవ వేడుకలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి

### రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్



**మెదక్, ఆగస్టు 13 (సమ సమాజం):** మెదక్ జిల్లా ఎస్పీ శ్రీమతి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్ గారు మాట్లాడుతూ...భావితరాల వారికి స్ఫూర్తి నిచ్చేలా వినూత్న ప్రక్రియలో కొనసాగుతున్న వజ్రోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ శ్రీమతి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్ గారు పిలుపునిచ్చారు. 16వ తేదీన తెలంగాణ రాష్ట్ర సామూహిక జాతీయ గీతాలాపన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్లు, జంక్షన్లు, మైదానలలో జాతీయ గీతం నిర్దేశించిన సమయం ఉదయం 11:30 నిమిషాలకు సామూహిక జాతీయ గీతాలాపనకు అన్ని ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ఆ సందర్భంలో ఎక్కడి వారు అక్కడ నిలబడి జాతీయ గీతాలాపన చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. సామూహిక జాతీయ గీతాలాపన గ్రామాలు,మండలలు, నగరంలో ఎక్కడ,ఏ ప్రాంతాలలో జరుగుతుందనే విషయాన్ని మైకుల ద్వారా ఇప్పటికే ముమ్మరంగా ప్రచారం చేస్తూ..ఫ్లెక్సిలు,బోర్డులను ఏర్పాటు చేసేటట్లు చేశామని అన్నారు. స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని, నవశకంవైపు భారతదేశాన్ని నడిపించడంలో ప్రజలను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్న తరుణంలో జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలను ఈ వజ్రోత్సవాల్లో భాగస్వామ్యమై జిల్లా సందడిగా మారిందన్నారు.




# చలన చిత్రం

ఎనిమిదేళ్ల కిందట యువ కథానాయకుడు నిఖిల్ సిద్దార్థ.. కొత్త దర్శకుడు చందూ మొండేటి కాంబినేషన్లో వచ్చిన 'కార్తికేయ' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని అప్పుడే సంకేతాలు ఇచ్చారు. ఎట్టకేలకు 'కార్తికేయ-2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కార్తికేయ (నిఖిల్ సిద్దార్థ) ఎంబీబీఎస్ పూర్తి చేసి ఓ హాస్పిటల్లో ప్రాక్టీస్ చేస్తుంటాడు. ప్రతి విషయాన్నీ శాస్త్రీయ దృక్పథంతో చూసే అతను.. మూఢ నమ్మకాలను తీవ్రంగా వ్యతిరేకిస్తుంటాడు. ఐతే తన తల్లి కోరిక మేరకు ఒక మొక్కు తీర్చుకోవడానికి ఆమెతో కలిసి ద్వారకకు వెళ్తాడు. అక్కడ అతడికి కొన్ని అనూహ్య పరిణామాలు ఎదురవుతాయి. ఒక ఆర్కియాలజిస్ట్ తనకో బాధ్యతను అప్పగించి ప్రాణాలు కోల్పోతాడు. అతణ్ని హత్య చేసిన నేరం కార్తికేయ మీద మోపి పోలీసులు అతడి వెంట పడతారు. వారి నుంచి తప్పించుకుని ఒక లక్ష్యం కోసం కార్తికేయ తన ప్రయాణాన్ని మొదలుపెడతాడు. ఆ లక్ష్యం ఏంటి.. దాన్ని అతను చేరుకున్నాడా లేదా అన్నది మిగతా కథ. ఎనిమిదేళ్ల కిందట 'కార్తికేయ'తో తెలుగు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన చందూ మొండేటి సీక్వెల్ కోసం మళ్లీ ఇంకో ఆసక్తికర కథను తీర్చిదిద్దుకున్నాడు. ఈసారి అతడి కాన్వాస్ పెద్దదైంది. కథలోకి భారీతనం వచ్చింది. ఈ క్రమంలో ఇంకేదో చేయాలన్న తపనలో చందూ అక్కడక్కడా కొంచెం గాడి తప్పిన మాట వాస్తవమే. కానీ అతను ప్రేక్షకులను నిరాశకైతే గురి చేయలేదు. 'కార్తికేయ' స్థాయిలో ఇది ప్రేక్షకులను ఉత్కంఠతో ఊపేయక పోయినా.. ఆద్యంతం ఎంగేజ్ చేస్తూ కొంచెం భిన్నమైన.. సంతృప్తికర సినిమా చూసిన ఫీలింగ్ మాత్రం కలిగిస్తుంది. హీరో ఏమో కళ్లతో చూసేది తప్ప ఏదీ నమ్మని ఒక యంగ్ డాక్టర్.. కథేమో దేవుడు-గుడి చుట్టూ తిరుగుతుంది. 'కార్తికేయ' యునీక్ గా అనిపించి ప్రేక్షకులను దృష్టిని ఆకర్షించడానికి ఈ కాన్ఫ్లిక్టే ప్రధాన కారణం. ఈ కాన్సెప్ట్ చుట్టూ ఉత్కంఠభరితంగా కథను మంచి థ్రిల్స్ ఇచ్చాడు చందూ మొండేటి. 'కార్తికేయ-2'లోనూ ఈ కాన్ఫ్లిక్ట్ అయితే సేమ్. హీరో పాత్రను అలాగే ఉంచి.. 'కార్తికేయ' థీమ్ ను కొనసాగిస్తూ ఒక కొత్త కథను చెప్పే ప్రయత్నం చేశాడు. సుబ్రహ్మణ్యపురం నుంచి కథను ద్వారకకు తీసుకెళ్లాడు. 'కార్తికేయ'లో ఒక ఊరిలో జరిగే వింత ఘటనల తాలూకు మిస్టరీని ఛేదించే హీరో.. ఈసారి ఒక లక్ష్యంతో ప్రయాణం చేస్తాడు. ఈ ప్రయాణంలో అతడికి ఎదురయ్యే అనుభవాల సమాహారమే సినిమా. 'కార్తికేయ' కథలో ఉన్న మిస్టరీ వల్ల.. దాన్ని ఛేదించే క్రమంలో వచ్చే సన్నివేశాలు చాలా థ్రిల్లింగ్ గా అనిపిస్తాయి. సస్పెన్స్ ఫ్యాక్టర్ ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురి చేస్తుంది. 'కార్తికేయ-2'లో ఆ తరహా థ్రిల్స్ మిస్సవడం మైనస్. అలా అని ఇది బోరింగ్ గా అయితే అనిపించదు. ఎప్పటికప్పుడు కథ కొత్త మలుపులు తిరుగుతూ.. కొత్త కొత్త పాత్రలు రంగంలోకి దిగుతూ.. తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తిని రేకెత్తిస్తాయి. ప్రథమార్ధంలో కొంచెం ఒడుదొడుకులతో సాగే 'కార్తికేయ-2' ఇంటర్వెల్ బ్యాంగ్ దగ్గర ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుంది. ద్వితీయార్ధంలో చాలా వరకు కథ ఆసక్తికరంగానే సాగుతుంది. కడియానికి సంబంధించి క్లూస్ ఒక్కోటి కనిపెడుతూ.. చివరగా దాన్ని సాధించే వరకు సాగే ప్రయాణంలో వచ్చే ఎపిసోడ్లు ఆకట్టుకుంటాయి. అనుపమ్ ఖేర్ పాత్ర కనిపించేది కాసేపే అయినా.. ఆయన సినిమాకు చేకూర్చాల్సిన ప్రయోజనం చేకూర్చాడు. శ్రీకృష్ణుడు కేవలం దేవుడు కాదు అంతకుమించి అంటూ ఆయన గొప్పదనాన్ని అనుపమ్ పాత్రతో చెప్పించిన విధానం సినిమాకే హైలైట్ గా నిలుస్తుంది. 'కార్తికేయ' సూపర్ సక్సెస్ తర్వాత ఆ పాత్రను మరోసారి చేస్తుండటంతో నిఖిల్ లో ఆత్మవిశ్వాసం పెరిగింది. అది పాత్రలో ప్రతిఫలించింది. ఆద్యంతం మంచి ఎనర్జీతో నిఖిల్ ఆకట్టుకున్నాడు. స్వాతి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కూడా బాగానే చేసింది. ఐతే ఆమె హీరోయిన్ లాగా కాకుండా సినిమాలో ఒక పాత్రధారిలానే కనిపిస్తుంది. శ్రీనివాసరెడ్డి కీలక పాత్రలో రాణించాడు. విలన్ పాత్ర చేసిన ఆదిత్య మేనన్ జస్ట్ ఓకే అనిపించాడు. ఆయన పాత్ర అనుకున్నంత స్థాయిలో లేదు. హీరో తల్లి పాత్రలో తులసి తనకు అలవాటైన రీతిలో నటించింది. ప్రవీణ్.. సత్యలకు పెద్దగా స్క్రీన్ టైం దొరకలేదు. అభీరుడి పాత్రలో చేసిన నటుడు ఆకట్టుకున్నాడు. చందూ మొండేటి రచయితగా.. దర్శకుడిగా మళ్లీ ఈ చిత్రంతో ఫామ్ అందుకున్నాడు. ఎంగేజ్ చేశాడు.

## డిఫరెంట్ లైన్‌లో కార్తికేయ-2

### ప్రతిభ చాటిన దర్శకుడు చందు మొండేటి

## సెప్టెంబర్ 23 న విడుదలకు సిద్ధంగా అల్లూరి




యంగ్ హీరో శ్రీ విష్ణు నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'అల్లూరి' సినిమా విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. టాలీవుడ్‌లో ఉన్న యంగ్ హీరోలలో కంప్లీట్ డిఫరెంట్ జోనర్‌లో సినిమాలు చేస్తూ తనకంటూ ఓ మార్కెట్ సంపాదించుకున్నారు శ్రీ విష్ణు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, కథనం ఉన్న చిత్రాలు ఈ హీరోకి మంచి క్రేజ్ తీసుకువచ్చి పెట్టాయి. బాక్సాఫీస్ వద్ద వసూళ్ళ పరంగా మినిమం గ్యారెంటీ హీరో అని ఇండస్ట్రీ వర్గాలలో పేరు తెచ్చుకున్నారు.ఆయన ఇప్పుడు మరో విభిన్న కథా చిత్రం అల్లూరితో రాబోతున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ వర్మ దర్శకత్వం వహిస్తుండగా, బెక్కెం బబిత సమర్పణలో లక్కీ మీడియా పతాకంపై బెక్కెం వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీవిష్ణు నిజాయతీగల పోలీసు అల్లూరి సీతారామరాజుగా కనిపించనున్నారు. నిజాయితీకి మారు పేరు అనేది చిత్రం ట్యాగ్ లైన్. ఇప్పటికే, ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రచారం చిత్రాలు సినిమాపై బాగానే అంచనాలను పెంచాయి. క ఈ సినిమా టీజర్ చూస్తే యాక్షన్ ఎంటర్ టైనర్‌గా 'అల్లూరి' రాబోతుందని అర్థమవుతోంది. గతంలో ఎప్పుడూ శ్రీ విష్ణు ఇలాంటి పాత్రలో కనిపించలేదు. 'అల్లూరి'లో మాత్రం శ్రీ విష్ణు కంప్లీట్ మాస్ హీరోగా అలరించబోతున్నారు. అయితే, తాజాగా చిత్రబృందం సినిమా విడుదల తేదీని ప్రకటించింది. ఈ మూవీని సెప్టెంబర్ 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ పోస్టర్‌ను వదిలారు. ఇందులో విష్ణు సరసన కయ్యాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుంది. సుమన్ కీలక పాత్రలో కనిపించనున్నారు.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in